సాక్షి
నిర్మల్
గురువారం । 7 । మార్చి । 2024



ముస్తాబైన ఆలయాలు

జిల్లాలోని ఆయా ఆలయాలు ముస్తాబయ్యాయి. శుక్రవారం మహాశివరాత్రి పర్వదినం కావడంతో భక్తులతో కిటకిటలాడనున్నాయి. ఈ సందర్భంగా ఏర్పాట్లు పూర్తి చేశారు. 8లో▸



మల్చింగ్ సాగుతో లాభాలు

పీచర గ్రామ రైతులు మల్చింగ్ విధానంలో కర్బూజ సాగు చేసి అధిక లాభాలు గడిస్తున్నారు. డ్రిప్ పద్ధతిలో తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు. 9లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
36.0 /22.0

ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. చలి తగ్గుతుంది.

న్యూస్‌రీల్

శివరాత్రి కోసం గోదావరిలోకి నీరు



నీటి మట్టాన్ని పరిశీలిస్తున్న చైర్మన్, సభ్యులు

ఖానాపూర్: శివరాత్రి పర్వదినం సందర్భంగా గోదావరికి పుణ్యస్నానాల కోసం వచ్చే భక్తుల సౌకర్యార్థం ఎస్సారెస్పీ నుంచి గోదావరికి అధికారులు నీటిని విడుదల చేశారు. పట్టణంలోని గోదావరి తీరంలో స్నాన ఘట్టానికి చేరుకున్న నీటి మట్టాన్ని మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం ఆధ్వర్యంలో కమిషనర్ మనోహర్‌తో పాటు పాలకవర్గ సభ్యులు బుధవారం పరిశీలించారు. శివరాత్రి సందర్భంగా గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించే భక్తులకు సరిపడా నీరు లేకపోవడంతో ఇటీవల ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే సూచన మేరకు ఎస్సారెస్పీ నుంచి విడుదలైన నీరు పట్టణంలోని గోదావరిలో గల స్నానఘట్టాల వద్దకు చేరుకుంది. దీంతో గోదావరి వద్దకు వచ్చిన నీటిని, ఇతర ఏర్పాట్లను అధికారులు, పాలకవర్గ సభ్యులతో కలిసి చైర్మన్ పరిశీలించారు. గోదావరిలో పుణ్యస్నానమాచరించేందుకు వచ్చే వృద్ధులు, మహిళలు, పిల్లల కోసం షవర్లు ఏర్పాటు చేయడంతో పాటు మహిళలకు దుస్తులు మార్చుకునేందుకు వీలుగా ప్రత్యేక గదులు ఏర్పాటు చేయిస్తామని చైర్మన్ తెలిపారు. వారి వెంట కౌన్సిలర్లు, నాయకులు కావలి సంతోష్, జన్నారపు శంకర్, నాయిని సంతోష్, పరిమి సురేశ్ తదితరులున్నారు.


నారీశక్తి బంధన్ అభియాన్ వీక్షించిన బీజేపీ నాయకులు



ప్రధాని ప్రసంగాన్ని వీక్షిస్తున్న నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: నారీశక్తి వందన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా పశ్చిమ బెంగాల్‌లో ప్రధాని నరేంద్రమోదీ మహిళా శక్తి గురించి, దేశంలో బీజేపీ ప్రవేశ పెట్టిన మహిళా సంక్షేమ కార్యక్రమాల గురించి వర్చువల్ విధానంలో వివరించారు. ఈ సందర్భంగా మహిళా మోర్చా ఆధ్వర్యంలో బుధవారం ఆర్కే కన్వెన్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన ఎల్‌ఈడీ స్క్రీన్ ద్వారా స్థానిక ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి, మహిళా మోర్చా నాయకులు మోదీ ప్రసంగాన్ని వీక్షించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్‌రెడ్డి, నాయకులు అయ్యన్నగారి భూమయ్య, రావుల రాంనాథ్, సామ రాజేశ్వర్‌రెడ్డి, సాదం అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు రద్దు చేయాలని బీఆర్‌ఎస్ ధర్నా



నినదిస్తున్న నాయకులు

నిర్మల్‌టౌన్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్‌పై ఫీజు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట బీఆర్‌ఎస్ నాయకులు బుధవారం ధర్నా చేశారు. మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు రాము, నాయకులు నాలం శ్రీనివాస్, ధర్మాజీ రాజేందర్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నిలబెట్టుకోకుంటే ప్రజల పక్షాన పోరాడుతామని హెచ్చరించారు.

వివిధ రంగాల్లో రాణిస్తున్న వారిని అభినందించాలి



కేక్ కట్ చేస్తున్న ఆర్టీసీ సిబ్బంది, డీఆర్డీవో

నిర్మల్‌టౌన్: రాజకీయాలు, విద్య, ఉద్యోగాల్లో రాణిస్తున్న మహిళలను అభినందించాలని డీఆర్డీవో విజయలక్ష్మి సూచించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్డీవో మాట్లాడుతూ... మహిళా దినోత్సవం రోజున శివరాత్రి ఉన్నందున బుధవారమే వేడుకలు జరుపుకొన్నట్లు తెలిపారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనపరిచిన మహిళా కండక్టర్లను సత్కరించారు. నిత్యం ఆర్టీసీ బస్సులో ప్రయాణించే ముగ్గురు మహిళా ప్రయాణికులను సన్మానించారు. డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి, సహాయ మేనేజర్లు రాజశేఖర్, నవీన్‌కుమార్, మహిళా ఉద్యోగులు, కండక్టర్లు, డ్రైవర్లు, మెకానిక్‌లు పాల్గొన్నారు.

బల్దియాలో అవినీతి బాగోతం



కలెక్టర్ ఆశిష్‌సంగ్వాన్‌కు ఫిర్యాదు చేస్తున్న చైర్మన్, కౌన్సిలర్లు (ఫైల్)

- ఫిర్యాదు చేసినా పట్టింపు శూన్యం
- కదలని మున్సిపల్ అధికారులు
- రూ.లక్షలు కాజేసినట్లు ఆరోపణలు
- మెప్మా డీఎంసీపై పలు ఫిర్యాదులు
- చర్యలు చేపట్టని ఉన్నతాధికారులు

నిర్మల్: మున్సిపాలిటీల్లో అక్రమాలకు అంతులేకుండా పోతోంది. సంబంధిత ఉన్నతాధికారులు వంత పాడటంతోనే ఈ అవినీతి జాతర కొనసాగుతోందన్న ఆరోపణలున్నాయి. నిర్మల్ బల్దియాలో అవినీతికి పాల్పడ్డ అధికారిపై చర్యలు తీసుకోవాలని సాక్షాత్తు కౌన్సిల్ ఫిర్యాదు చేసి వారమైనా చర్యలు తీసుకోవడం లేదు. మెప్మా డీసీఎంపై ఇప్పటికే రెండు మూడుసార్లు ఫిర్యాదులు వచ్చాయి. తాజాగా మున్సిపల్ పాలకవర్గమే ఆయనను తొలగించాలంటూ కమిషనర్‌కు ఫిర్యాదు చేసింది. మరోవైపు మున్సిపాలిటీల్లో అవినీతి 'రేటు' రోజురోజుకూ పెరిగిపోతోంది. ఏ పని కావాలన్నా.. పైసలు లేనిదే ముందుకు వెళ్లడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

మెప్మా డీసీఎంపై..

పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా)లో పేదరిక నిర్మూలన ఏ స్థాయిలో ఉందో తెలియదు గానీ.. అవినీతి సంపాదన మాత్రం పెరుగుతోందన్న ఆరోపణలున్నాయి. మెప్మా డీసీఎం (డిస్ట్రిక్ట్ మిషన్ కో–ఆర్డినేటర్) సుభాష్‌పై నిర్మల్ మున్సిపల్ పాలకవర్గమే తీవ్ర ఆరోపణలు చేస్తోంది. ఈమేరకు గతనెల 26వ తేదీన మెజార్టీ కౌన్సిలర్లు ఆయనపై కమిషనర్ రాజుకు ఫిర్యాదు చేశారు. ప్రధానంగా సిటీ లైవ్లీహుడ్ సెంటర్ (సీఎల్‌సీ) పేరిట మంజూరైన నిధుల్లో అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. ఇందులో డీసీఎం రూ.40లక్షల వరకు నిధులను సీఎల్‌సీ ఖాతా నుంచి ముందుగా ఇతరుల ఖాతాల్లోకి మళ్లించి, తర్వాత వాటిని తాను డ్రా చేసి తీసుకున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎస్‌ఎల్‌ఎఫ్(స్లమ్‌లెవల్ ఫెడరేషన్)లోనూ చేతివాటం ప్రదర్శించారని ఆరోపించారు. స్త్రీనిధి ఇన్సెంటివ్‌లో 50శాతం రిసోర్స్‌పర్సన్ల నుంచి తీసుకున్నట్లు తెలిపారు. దీనిపై గతంలోనూ కలెక్టర్, అప్పటి మంత్రి దృష్టికీ తీసుకెళ్లినట్లు చెప్పారు.

ఇష్టారీతిన బిల్లులు..

మున్సిపాలిటీ ఖజానాను ఎలా కొల్లగొడుతున్నారో.. వాళ్లు పెట్టే బిల్లులే చెబుతున్నాయి. గతేడాది ఎన్నికల కోడ్ కారణంగా నిర్మల్ మున్సిపాలిటీలో అసలు బతుకమ్మ ఉత్సవాన్నే నిర్వహించలేదు. అయినా.. సదరు సంబురాలను నిర్వహించినట్లు ఏకంగా రూ.4.99లక్షల బిల్లులు పెట్టారు. ఇలా.. ఎన్నో పనుల పేరిట రూ.లక్షల్లో బిల్లులు పెట్టి ప్రజాధనాన్ని కొల్లగొట్టారు. వీటిపైనా ఉన్నతాధికారుల దాకా ఫిర్యాదులు వెళ్లాయి. కానీ.. చర్యలు మాత్రం ఇప్పటిదాకా తీసుకోకపోవడం అనుమానాస్పదంగా మారింది. డీసీఎం సుభాష్‌పై వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో శాఖాపరమైన చర్యలు తీసుకోవాలంటూ కలెక్టర్, అడిషనల్ కలెక్టర్ (స్థానిక సంస్థలు), మెప్మా ఎండీకి మున్సిపల్ కమిషనర్ లేఖలు రాసినట్లు తెలిసింది.

బయటపెట్టినా చర్యలేవి?

మెప్మా డీసీఎం అవినీతిని ఆధారాలతో సహా బయటపెట్టినా సంబంధిత అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదంటూ కౌన్సిలర్లు ప్రశ్నిస్తున్నారు. సీఎల్‌సీ నిధుల్లో అవకతవకలపై ఆధారాలతో సహా ఇచ్చినా ఎందుకు స్పందించడం లేదంటున్నారు. ఇందులో సంబంధిత ఉన్నతాధికారుల పాత్ర కూడా ఉందా..? అని అనుమానిస్తున్నారు. గతంలోనూ నిర్మల్ బల్దియాలో దొంగ రసీదులు ఇచ్చి.. పోలీసు కేసుల వరకూ వెళ్లినా సదరు సిబ్బందిపై చర్యలు తీసుకోలేదు. రెవెన్యూ విభాగంలో చేతివాటం చూపుతూ ఇటీవలే ఏసీబీకి కూడా చిక్కారు. అయినా నిర్మల్ మున్సిపాలిటీలో అవినీతి పర్వం మాత్రం ఆగడం లేదన్న ఆరోపణలున్నాయి.

'గులాబీ' గూటికి పగుళ్లు!

- బీఎస్పీ, బీఆర్‌ఎస్ పొత్తుతో కాంగ్రెస్‌లోకి సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనప్ప
- ఇప్పటికే 'హస్తం' పార్టీలోకి పెద్దపల్లి ఎంపీ వెంకటేశ్ నేత
- మాజీ ఎమ్మెల్యేలు, నాయకులు పార్టీ మార్పుపై చర్చలు
- బీఆర్‌ఎస్ నేతలే లక్ష్యంగా కాంగ్రెస్, బీజేపీ పావులు



సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: లోక్‌సభ ఎన్నికల ముందు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రాజకీయాల్లో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. బీఆర్‌ఎస్‌తో బీఎస్పీ పొత్తు ఖరారు కావడంతో సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షుడు కోనేరు కోనప్ప, ఆయన సోదరుడు జెడ్పీ చైర్‌పర్సన్ కోనేరు కృష్ణారావుతో పాటు అనుచరవర్గం కాంగ్రెస్‌లోకి వెళ్లేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డిని బుధవారం కలిశారు. దీంతో పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు ఈ నియోజకవర్గంలో మరింత దెబ్బ తగలనుంది. తాజా పరిణామాలతో ఉమ్మడి జిల్లాలో మరికొందరు నాయకులు కండువాలు మార్చుతారనే ప్రచారం జోరందుకుంది. ప్రధానంగా బీఆర్‌ఎస్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులే లక్ష్యంగా బీజేపీ, కాంగ్రెస్ పావులు కదుపుతుండడంతో ఎవరు ఎటువైపు వెళ్తున్నారనేది ఆసక్తికరంగా మారింది. అటు ఆదిలాబాద్ ఇటు పెద్దపల్లి పార్లమెంట్ స్థానాల్లో నాయకుల తీరు రాజకీయ మార్పులకు దారి తీస్తున్నాయి.

మాజీ ఎమ్మెల్యేల పక్క చూపులు

బీఆర్‌ఎస్‌కు చెందిన కొందరు మాజీ ఎమ్మెల్యేలు పార్టీని వీడేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాభవంతో నేతల్లో నైరాశ్యం నెలకొంది. తమ రాజకీయ భవిష్యత్ కోసం పార్టీ మారేందుకు అంతర్గతంగా చర్చలు సాగుతున్నాయి. కాంగ్రెస్‌లోకి వెళ్లడమా..? బీజేపీలో చేరడమా..? అనే దానిపై తర్జనభర్జన పడుతున్నారు. ప్రస్తుతం 'గులాబీ' పార్టీకి గడ్డుకాలమే ఉండడంతో కార్యకర్తలు, నాయకుల నుంచి ఒత్తిడి కారణంగా మార్పు తథ్యంగా భావిస్తున్నారు. ఇందుకు లోక్‌సభ ఎన్నికలు మంచి తరుణంగా భావిస్తూ ఎవరికి ఏ పార్టీతో మేలు ఉంటుందో లెక్కలు వేసుకుంటున్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలో ఇద్దరు మాజీ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ టచ్‌లోకి వెళ్లినట్లు సమాచారం. వచ్చే ఎన్నికల్లో తమకు ప్రాధాన్యం ఇస్తేనే చేరుతామనే మెలిక పెట్టినట్లుగా చెబుతున్నారు. అయితే ఎవరికీ స్పష్టమైన హామీ రానట్లు తెలిసింది. వీరితోపాటు మరో ఇద్దరు మాజీ ఎమ్మెల్యేలు బీజేపీ నాయకులతో చర్చలు జరిపారు. తమ పార్టీలోకి రావాలని ఆహ్వానాలు అందడంతో పార్టీ మార్పుపై నిర్ణయం తీసుకోవడంపై ఆలోచిస్తున్నారు. ఓ మాజీ ఎమ్మెల్సీతోపాటు సీనియర్ నాయకులు కూడా పార్టీ మార్పుపై కొంత కాలంగా సమాలోచనలు చేస్తున్నారు.

బయటపడనున్న అసంతృప్తులు

ఉమ్మడి జిల్లాలో రెండు ఎంపీ స్థానాల గెలుపు కోసం కాంగ్రెస్, బీజేపీ గట్టి ప్రయత్నాలే చేస్తున్నాయి. ఇందుకు దీటైన అభ్యర్థుల కోసం అనేక రకాలుగా వడపోతలు చేస్తున్నాయి. ఆదిలాబాద్ సిట్టింగ్ సీటును ఎంపీ సోయం బాపూరావుకే కట్టబెడతారా..? లేదా..? అనే సస్పెన్స్ కొనసాగుతోంది. మాజీ ఎంపీ రమేశ్ రాథోడ్, డాక్టర్ సుమలత, జెడ్పీ చైర్‌పర్సన్ రాథోడ్ జనార్దన్, తదితరులు పోటీలో ఉన్నారు. ఆదివాసీ, లంబాడా వర్గాల ప్రభావం, ప్రత్యర్థి పార్టీల్లో అభ్యర్థుల ఖరారు కాకపోవడంతో వేచి చూస్తున్నారు. మళ్లీ 'సోయం'కు అవకాశం రాకపోతే ఆయన నిర్ణయం ఎలా ఉండబోతుందనే ఆసక్తి నెలకొంది. ఇక బీఆర్‌ఎస్ నుంచి మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, మాజీ ఎంపీ గోడం నగేశ్ ఉన్నారు. నగేశ్ గత అసెంబ్లీ ఎన్నికల్లో బోథ్ టికెట్ ఆశించి భంగపడ్డారు. ఎమ్మెల్సీ, కార్పొరేషన్ పదవులు దక్కలేదు. దీంతో ఆయన నిర్ణయం ఎటువైపు ఉంటుందోనని ఆసక్తిగా మారింది. ఇక పెద్దపల్లి లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో బీఆర్‌ఎస్ అభ్యర్థిగా మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను ప్రకటించగా, ఆయన ప్రచారం చేపట్టారు. కాంగ్రెస్‌లో ఎంపీ టికెట్ ఆశించి పార్టీలో చేరిన సిట్టింగ్ ఎంపీ బోర్లకుంట వెంకటేశ్ నేత, చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ తనయుడు గడ్డం వంశీకృష్ణ ప్రధానంగా పోటీలో ఉండగా, పెర్క శ్యామ్ మరికొందరు టికెట్ ఆశిస్తున్నారు. 'గడ్డం' కుటుంబానికే మళ్లీ టికెట్ ఇస్తే పార్టీకి ఇబ్బంది అవుతుందని కొందరు అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో వంశీకి టికెట్ ఇస్తే నాయకుల్లో అసంతృప్తి రాజుకోనుంది. ఇక బీజేపీలో మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి, దుర్గం అశోక్, కొయ్యల ఏమాజీ టికెట్ ఆశిస్తుండగా, ఎస్.కుమార్‌తోపాటు మాజీ ఎమ్మెల్యే బొడిగే శోభ వంటి నేతలు పోటీలో ఉన్నారు.

వేములవాడకు ప్రత్యేక బస్సులు

నిర్మల్‌టౌన్: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం నుంచి రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడకు 30 ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పెద్దలకు రూ.220, పిల్లలకు రూ.120 బస్సు చార్జి ఉంటుందని పేర్కొన్నారు. మహాశివరాత్రి పర్వదినాన నిర్మల్ పరిసర ప్రాంతాల్లోని ప్రముఖ శైవక్షేత్రాలున్న బూరుగుపల్లి, కదిలి, శ్రీరాంసాగర్, కాల్వకు కూడా ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం ఉంటుందని వివరించారు. భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మార్చిలోనే మండుతున్నాయ్..!



కూరగాయల మార్కెట్‌లో గొడుగుల కింద చిరువ్యాపారులు



సోడా బండి వద్ద గుమిగూడిన జనం



మధ్యాహ్నం నిర్మానుష్యంగా పట్టణంలోని రోడ్డు

మార్చి ఆరంభంలోనే భానుడు తన ప్రతాపం చూపుతున్నాడు. జిల్లా కేంద్రంలో బుధవారం 37 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మధ్యాహ్నమే రోడ్లు నిర్మానుష్యంగా మారాయి. అత్యవసర పనుల నిమిత్తం బయటకు వచ్చిన జనం గొడుగులు పట్టుకుని, తలకు టవళ్లు చుట్టుకుని కనిపించారు. కొబ్బరి బోండాలు, గోలి సోడా తాగుతూ ఎండవేడిమి నుంచి ఉపశమనం పొందడం కనిపించింది. - సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

రైతన్నకు కాంగ్రెస్ సర్కారు అండ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొజ్జు, పక్కన కలెక్టర్

కడెం: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రైతువేదికలో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్ సిస్టం ప్రారంభోత్సవ కార్యక్రమంలో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌తో కలిసి పాల్గొన్నారు. రైతునేస్తం కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్ సిస్టంను సీఎం రేవంత్‌రెడ్డి వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సిస్టం ద్వారా రైతులకు ఎప్పటికప్పుడు శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు అందుతాయని, దీనిని రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ.. ఆధునిక సాంకేతికతను సాగు రంగానికి అనుసంధానం చేస్తూ, రైతుల సమస్యలు సత్వరమే పరిష్కరించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం రైతునేస్తం కార్యక్రమాన్ని ప్రారంభించిందని తెలిపారు. తొలి విడతగా రాష్ట్ర వ్యాప్తంగా 110 రైతువేదికలకు వీడియో కాన్ఫరెన్స్ వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. వచ్చే ఉగాది నాటికి రాష్ట్రవ్యాప్తంగా అన్ని రైతువేదికలకు దీనిని విస్తరించనున్నట్లు వివరించారు. డీఏవో అంజిప్రసాద్, డీఆర్డీవో విజయలక్ష్మి, ఎంపీపీ అలెగ్జాండర్, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు రమేశ్, యూత్‌కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సతీశ్‌రెడ్డి, రైతులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం అమలుకు చర్యలు చేపట్టాలి



కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

కడెం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వందశాతం అమలుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో నీతి ఆయోగ్ కార్యక్రమంలో ఆయా శాఖల జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. నీతి ఆయోగ్ కార్యక్రమంలో కడెం మండలానికి పదోస్థానం రావడం అభినందనీయమన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయం, పోషకాహారం, జలవనరులు, ఆర్థిక, నైపుణ్యాభివృద్ధి, మౌలిక సదుపాయాలు తదితర అంశాల్లో నీతి ఆయోగ్ కింద దేశవ్యాప్తంగా అభివృద్ధి, పురోగతిపై సర్వే నిర్వహించినట్లు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పోషకాహారం అందించాలని సూచించారు. ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలను పూర్తిస్థాయిలో నియమించాలని, కడెం, పెంబి, ప్రభుత్వాస్పత్రుల్లో రక్తహీనత, టీబీ, మధుమేహంతో బాధపడుతున్నవారికి నాణ్యమైన వైద్యం అందించాలని వైద్యాధికారులను ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించాలని సూచించారు. నిర్లక్ష్యం వహిస్తే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. డీఆర్డీవో విజయలక్ష్మి, డీఈవో రవీందర్‌రెడ్డి, డీఎంహెచ్‌వో ధన్‌రాజ్, డీపీవో శ్రీనివాస్, స్త్రీ, శిశు సంక్షేమశాఖ అధికారి రమేశ్, డీటీడీవో అంబాజీ, ఎంపీడీవోలు రమాకాంత్, అరుణ తదితరులున్నారు.

'లాగిన్' కష్టాలు

- ప్రజాపాలన నూతన దరఖాస్తుల నమోదుకు ఓపెన్ కాని సైట్
- పాత దరఖాస్తుల సవరణకే చాన్స్
- అయోమయంలో దరఖాస్తుదారులు



జిల్లా కేంద్రంలోని కౌంటర్ వద్ద దరఖాస్తుదారులు

నిర్మల్‌చైన్‌గేట్: ప్రజాపాలనలో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలుకు దరఖాస్తులు స్వీకరించింది. కొన్ని హామీలను ఇప్పటికే నెరవేరుస్తోంది. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకోనివారికి మళ్లీ అవకాశం కల్పిస్తామని ప్రకటించింది. కానీ.. క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉంది. ప్రజాపాలన కొత్త దరఖాస్తులను స్వీకరించే పోర్టల్ చాలా రోజులుగా ఓపెన్ కావడంలేదు. పాత దరఖాస్తుల్లో సవరణలు మాత్రమే చేసేలా వెబ్‌సైట్ పని చేస్తోంది. దీంతో దరఖాస్తుదారులకు ఇబ్బందిగా మారింది. ముఖ్యంగా గృహజ్యోతి, మహాలక్ష్మి పథకాల్లో అనేక సందేహాలు కలుగుతున్నాయి. అర్హులు ఎంతమంది ఉన్నా పథకాన్ని వర్తింపజేస్తామని సంబంధిత శాఖ అధికారులు స్పష్టం చేస్తున్నా.. కొత్తగా దరఖాస్తు చేసుకోవడానికే వీలు లేకుండా పోయింది.

గంటల తరబడి నిరీక్షిస్తున్నా..

అర్హులు దరఖాస్తు చేసుకునేందుకు మున్సిపల్, ఎంపీడీవో కార్యాలయాలకు వెళ్తే గంటల తరబడి నిరీక్షించక తప్పడంలేదు. కొన్నిచోట్ల దరఖాస్తుదారుల నుంచి నిరసనలు వస్తున్నాయి. లాగిన్ కావడం లేదని అధికారులు చెబుతున్నారు. దరఖాస్తులను మరోసారి స్వీకరించి, తాము పిలిచిన సమయంలో రావాలని వారిని పంపిస్తున్నారు. దీంతో రోజువారీ కూలీలు, ప్రైవేట్ ఎంప్లాయీస్, చిరువ్యాపారులు, దివ్యాంగులు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అద్దెవాసులకు ఇబ్బందే..

ప్రభుత్వం అద్దెకు నివసిస్తున్న వారికి కూడా నెలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరా చేస్తామని ప్రకటించిన విషయం విదితమే. అయితే పట్టణాల్లో అద్దెకుంటున్న వారు గతంలో దరఖాస్తు చేసుకోలేకపోయారు. దీంతో వీరు మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిన పరిస్థితి ఉత్పన్నమైంది. ఎంపీడీవో కార్యాలయాలు, మున్సిపాలిటీల్లో దరఖాస్తు చేసుకోవాలని విద్యుత్‌శాఖ అధికారులు సూచించారు. దీంతో అర్హులు మళ్లీ దరఖాస్తు చేస్తున్నారు. ఇలాంటి వారి వివరాలు నమోదు చేయాలంటే వెబ్‌సైట్ ఓపెన్ కావడంలేదు. దీంతో వీరు వివిధ పథకాల కింద లబ్ధిపొందే అవకాశం కోల్పోయే ప్రమాదమేర్పడింది. ఈ విషయమై నిర్మల్ మున్సిపల్ కమిషనర్ ఎస్ఎన్ రాజు మాట్లాడుతూ.. ప్రజాపాలన దరఖాస్తులు నమోదుకు సంబంధించి బుధవారం సాయంత్రం వరకు వెబ్‌సైట్ ఓపెన్ కాలేదని తెలిపారు. దరఖాస్తుల ఆన్‌లైన్ కోసం ట్రయల్ రన్ చేస్తున్నామని పేర్కొన్నారు. దరఖాస్తుదారులకు ఎలాంటి సమస్యలు రాకుండా అన్ని ఏర్పాట్లు చేస్తామని చెప్పారు.

ఏఈఈపై ఆరోపణలు సరికాదు



మాట్లాడుతున్న ప్రవీణ్

కడెం: సదర్‌మాట్ కాలువ నీటి విడుదల కోసం ఏఈఈ రవికుమార్ డబ్బులు తీసుకున్నారని పలువురు రైతులు చేస్తున్న ఆరోపణలు అవాస్తవమని అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్స్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని విశ్రాంతి భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కొందరు కావాలనే ఏఈఈ రవికుమార్‌ను టార్గెట్ చేసుకుని తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. ఈ విషయమై ఈఈ విఠల్‌కు వినతిపత్రం ఇచ్చారు. కలెక్టర్‌కూ వినతిపత్రం ఇవ్వనున్నట్లు తెలిపారు. ఏఈఈలు శ్రీధర్, సాంబరాజు, అశ్విన్, జాకీర్, రాజేందర్‌రెడ్డి, సర్వరొద్దీన్, కిరీటీ, రాజు, సంజీవ తదితరులున్నారు.

కోర్టు ఏర్పాటు చేయాలి



వినతిపత్రం ఇస్తున్న న్యాయవాదులు

నిర్మల్‌టౌన్: హైదరాబాద్‌లోని హైకోర్టులో జస్టిస్ శ్రీదేవిని పలువురు నిర్మల్ న్యాయవాదులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నిర్మల్‌లో జిల్లా కోర్టు ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు డాక్టర్ ఎస్.లింగయ్య, జగన్మోహన్, దేవిదాస్, నవీన్ తదితరులున్నారు.

ఓటుహక్కుపై అవగాహన

భైంసా: బాసర ఆర్జీయూకేటీ ఎన్ఎస్ఎస్ వింగ్ ఆధ్వర్యంలో బుధవారం ఓటుహక్కుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. 130 మంది ఎన్ఎస్ఎస్ వలంటీర్లు బాసర రైల్వేస్టేషన్ వద్ద ప్లకార్డులు ప్రదర్శించి ఓటర్లకు చైతన్యం కల్పించే నినాదాలు చేశారు. రైల్వేస్టేషన్ రవీంద్రపూర్ కాలనీ పరిసర ప్రాంతాలకు ర్యాలీగా వెళ్లి ఓటరు బాధ్యత, రాజ్యాంగబద్ధంగా కల్పించిన హక్కుల గురించి వివరించారు. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ రాకేశ్‌రెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్స్ రామారావు, రమాదేవి, రాములు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

క్లుప్తంగా

9, 10వ తేదీల్లో అంతర్రాష్ట్ర కుస్తీ పోటీలు

కుంటాల: శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని సూర్యాపూర్ రాజరాజేశ్వర ఆలయ ప్రాంగణంలో ఈ నెల 9న, ఓల శివాలయ ఆలయ ప్రాంగణంలో 10న అంతర్రాష్ట్ర కుస్తీ పోటీలు నిర్వహించనున్నట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. మల్లయోధులు కుస్తీ పోటీల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి యువకుడి మృతి


హన్మంతు(ఫైల్)

నర్సాపూర్ (జీ): మండలంలోని బామిని(బీ) గ్రామానికి చెందిన యువకుడు ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బామిని(బీ) గ్రామానికి చెందిన చాతల హన్మంతు(30) చేపలు పట్టడానికి బుధవారం ఊరు పక్కనగల పాత చెరువుకు వెళ్లాడు. గాలంతో చేపలు పడుతుండగా ప్రమాదవశాత్తు చెరువులో పడి నీట మునిగాడు. చెరువులో బట్టలుతికేందుకు వెళ్లిన మృతుడి బంధువు గమనించి గ్రామంలోకి వెళ్లి గ్రామస్తులకు సమాచారం అందించింది. గ్రామస్తులు, బంధువులు వెంటనే చెరువు వద్దకు చేరుకుని హన్మంతును బయటకు తీసి ఆటోలో 108లో నిర్మల్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. అతడి భార్య గంగాసాగర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై హన్మాండ్లు తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులున్నారు.

మెడికల్ షాపుల తనిఖీ


తనిఖీ చేస్తున్న డ్రగ్ ఇన్‌స్పెక్టర్ శ్రీలత

ఇచ్చోడ/సిరికొండ: ఇచ్చోడ, సిరికొండ మండల కేంద్రాల్లోని పలు మెడికల్ షాప్‌లను డ్రగ్ ఇన్‌స్పెక్టర్ శ్రీలత బుధవారం తనిఖీ చేశారు. గడువు ముగిసిన మందులను విక్రయించవద్దని నిర్వాహకులకు సూచించారు. వైద్యులు రాసిన మెడిసిన్ మాత్రమే విక్రయించాలన్నారు. అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ద్విచక్రవాహనాల చోరీ నిందితుల అరెస్ట్


స్వాధీనం చేసుకున్న బైకులతో సీఐ అనిల్

నిర్మల్‌టౌన్: నిర్మల్, నిజామాబాద్ జిల్లాల్లో ద్విచక్ర వాహనాలను దొంగిలించిన ఇద్దరు మైనర్లను అరెస్ట్ చేసినట్లు పట్టణ సీఐ అనిల్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ... నిర్మల్ పట్టణంలో మూడు, సారంగపూర్, నిజామాబాద్‌లో ఒక్కో ద్విచక్రవాహనాలను దొంగిలించిన మైనర్లు వీటిని విక్రయించేందుకు నిర్మల్‌కు వచ్చారు. బుధవారం నిర్మల్‌లో పట్టణ పోలీసులు వాహనాలు తనిఖీ చేసే క్రమంలో అనుమానాస్పదంగా కనిపించారు. వీరిని విచారించడంతో పలుచోట్ల బైక్‌లు దొంగిలించినట్లు ఒప్పుకొన్నారు. వీరి నుంచి ఐదు బైకులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఇడకు సీఐ తెలిపారు. ఎస్సై రాజేశ్వర్, కానిస్టేబుళ్లు సందీప్, సుదర్శన్ తదితరులున్నారు.

ముస్తాబైన ఆలయాలు

- రేపు మహాశివరాత్రి పర్వదినం
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- సూర్యాపూర్‌లో కుస్తీ పోటీలు


సూర్యాపూర్‌లో రాజరాజేశ్వరుడు

కుంటాల: మండలంలోని సూర్యాపూర్ అటవీ ప్రాంతం సరిహద్దులో శ్రీరాజరాజేశ్వరాలయం వెలిసింది. గతంలో ఇక్కడ మూడు పురాతన విగ్రహాలు ఉండగా గ్రామస్తులు వాటికి పూజలు నిర్వహించేవారు. ఓలా గ్రామానికి చెందిన తిప్ప గజ్జారాం శివరాత్రి సందర్భంగా ఉపవాస దీక్షలు చేపట్టి నిత్యం పూజించేవాడు. గ్రామస్తులు చందాలు పోగుచేసి ఆలయ నిర్మాణానికి ముందుకు రాగా, కుంటాలకు చెందిన దూదేకుల బాబు ఆలయ నిర్మాణంలో ప్రత్యేక పాత్ర పోషించడం విశేషం. మహారాష్ట్రకు చెందిన భక్తులు అధికసంఖ్యలో హాజరై శ్రీరాజరాజేశ్వరుడికి కోడెలు సమర్పిస్తారు. కుస్తీ పోటీలు నిర్వహిస్తారు. ముధోల్ ఎమ్మెల్యేగా పోటీ చేసే నేతలు నియోజకవర్గానికి సూర్యాపూర్ రాజరాజేశ్వరాలయం ఈశాన్య దిశలో ఉండడంతో ఆలయంలో పూజలు నిర్వహించి ఇక్కడి నుంచే ప్రచారం ప్రారంభిస్తారు.

ప్రత్యేకం.. ఓలాదీశ్వరుడి ఆలయం


ఓలాలోని శివలింగం

కుంటాల మండలంలోని ఓలా లింగ మూర్తి ఆలయం రాతి కట్టడంతో కాకతీయుల కాలంలో నిర్మించారు. ఈ ఆలయానికి సుమారు 150 ఏళ్ల చరిత్ర ఉంది. ప్రతీ సోమవారం భక్తులు అధికసంఖ్యలో ఆలయానికి వచ్చి పూజలు చేస్తారు. భక్తుల కోరిన కోర్కెలు నెరవేరుతుండడంతో ఓలా గ్రామంలో నిత్యం ఓలాదీశ్వరుడుగా పూజలందుకుంటున్నాడు. గత ప్రభుత్వం రూ.25 లక్షలతో ఇక్కడ శివాలయాన్ని నిర్మించింది. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఇక్కడ కుస్తీ పోటీలు నిర్వహిస్తారు.

57 ఏళ్లుగా కుస్తీ పోటీలు


ఓలాదీశ్వరుడి ఆలయం

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని కుంటాల మండలంలోని సూర్యాపూర్ రాజరాజేశ్వర ఆలయ ఆవరణలో గ్రామస్తులు 57 ఏళ్లుగా కుస్తీ పోటీలు నిర్వహిస్తున్నారు. ఆలయ నిర్మాణానికి కృషి చేసిన పోరా గ్రామానికి చెందిన తిప్ప గజ్జారాం ఆలోచనతో అప్పటి గుర్రం చౌకీదార్ (అటవీశాఖ అధికారి) ప్రోత్సాహంతో ప్రత్యేకంగా నిర్వహిస్తున్న కుస్తీ పోటీల్లో తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతాల నుంచి మల్లయోధులు అధికసంఖ్యలో వచ్చి తలపడతారు. ఓలా గ్రామంలోనూ ఆరేళ్లుగా కుస్తీ పోటీలు నిర్వహిస్తున్నారు.

పశుపతినాథ్ ఆలయంలో..


ముస్తాబైన పశుపతినాథ్ ఆలయం

ముధోల్: మండల కేంద్రంలోని పశుపతినాథ్ ఆలయం శివరాత్రికి ముస్తాబైంది. ఆలయాన్ని రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. శివరాత్రికి ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

టెంబుర్నిలో శ్రీ చక్ర లింగేశ్వరస్వామి


శ్రీ చక్ర లింగేశ్వర స్వామి ఆలయం

నర్సాపూర్(జి): మండలంలోని టెంబుర్ని గ్రామ శివారులో శ్రీ చక్ర లింగేశ్వర స్వామి ఆలయానికి ప్రత్యేకత ఉంది. గ్రామస్తులు ఉపాధి పనులు చేస్తుండగా శివలింగం బయటపడింది. సుమారు 500 ఏళ్ల నాటిదని చరిత్రకారులు చెబుతున్నారు. ఇటీవల దేవాలయ శాఖ నిధులతో కల్యాణ మండపం నిర్మించారు. ఆలయ ప్రాంగణంలో గోశాల ఏర్పాటు చేశారు. శివరాత్రి ఉత్సవాలు, తొమ్మిదో వార్షికోత్సవం సందర్భంగా గురు, శుక్ర, శనివారాల్లో ఘనంగా పూజలు నిర్వహించనున్నారు. మండలంలోని చాక్ పల్లి అనుబంధ గ్రామం పాత డొంగుర్గాం శివారు సుద్ద వాగు ఒడ్డున సిద్దేశ్వరాలయం వెలిసింది. ఐదు శతాబ్దాల క్రితం నవసిద్ధులు, మునీశ్వరులు ఇక్కడ తపస్సు చేసినట్లు పూర్వీకులు చెబుతుంటారు. శివరాత్రి రోజు ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు చేశారు.

స్వామి దర్శనం.. సర్వపాపహరణం

- ముస్తాబైన 'కదిలె' శ్రీమాతాన్నపూర్ణ సహిత పాపహరేశ్వరాలయం
- నేటి నుంచి మహాశివరాత్రి ఉత్సవాలు


స్వామివారి విగ్రహం

దిలావర్‌పూర్: సహ్యాద్రిపర్వత శ్రేణుల్లోని 'కదిలి' లోయలో కొలువుదీరి ఉన్న శ్రీమాతాన్నపూర్ణ సహిత పాపహరేశ్వరాలయాన్ని దర్శించుకుంటే సర్వపాపాలు హరించబడతాయని భక్తుల ప్రగాఢ నమ్మకం. దిలావర్‌పూర్ మండలం మాడేగాం గ్రామపంచాయతీ పరిధిలోని కదిలి గ్రామ పరిసర అటవీప్రాంతంలో వెలసిందే శ్రీమతాన్నపూర్ణ పాపహరేశ్వరాలయం. సహ్యాద్రి కొండల్లో మాతృహత్యాపాపం నుంచి విముక్తి పొందేందుకు పరశురాముడు ఇక్కడ స్వయంగా శివలింగాన్ని ప్రతిష్ఠించి పూజించాడని ఆలయ చరిత్ర చెబుతోంది. ప్రకృతి అందాల నడుమ వెలసిన పాపహరేశ్వరస్వామి చెంతనే శ్రీమాతాన్నపూర్ణేశ్వరీదేవి వెలసింది. కోరిన కోర్కెలు తీరుస్తూ నిత్యం భక్తుల పూజలందుకుంటోంది.

కదిలే శివలింగం..

గర్భగుడిలోని శివలింగం భక్తితో పరిశీలిస్తే కదులుతున్నట్లు కనిపిస్తుంది. స్వామివారి ముందున్న నందీశ్వరుడి చెవిలో తమ కోరికలు చెప్పుకొంటే నెరవేరుతాయని భక్తుల నమ్మకం. ప్రాంగణంలో ఒకే కాండంలో 18 వృక్షాలు మిళితమైన వట వృక్షం, అత్తకోడళ్ల గుండాలు, సీతమ్మ అల్లుబండ, అన్నపూర్ణమాత, ఆలయ ద్వారపాలకులు సప్తరుషుల ధ్యాన మందిరం, నందీశ్వరుడు, ఆవునోటి ద్వారా కోనేరులో చేరే నీరు భక్తులను ఆకట్టుకుంటున్నాయి. చోళులు, కాకతీయ రాజుల కాలంలో నిర్మించిన అనేక విగ్రహాలు వారి కళానైపుణ్యానికి ప్రతిరూపంగా నిలుస్తున్నాయి.


శ్రీమాతాన్నపూర్ణ పాపహరేశ్వరాలయం


ఆలయంలోని నందీశ్వరుడు

వివిధ రాష్ట్రాల నుంచి..

పాపహరేశ్వరాలయానికి తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో వచ్చి స్వామివారి సేవలో పునీతులవుతున్నారు. అనేకమంది సినీ, రాజకీయ ప్రముఖులు కూడా స్వామివారికి ప్రత్యేక రుద్రాభిషేక పూజలు తరచూ నిర్వహిస్తుంటారు. ఈ ఆలయానికి నిర్మల్ పట్టణం నుంచి భైంసా పట్టణానికి వెళ్లే రహదారి గుండా 12 కిలోమీటర్లు ప్రయాణిస్తే దిలావర్‌పూర్ గ్రామ బస్టాండ్‌కు చేరుకోవచ్చు. ఇక్కడి నుంచి ఉత్తరదిశలో ఉన్న ఆలయ స్వాగత తోరణం నుంచి మరో ఆరు కిలోమీటర్లు ప్రయాణిస్తే పాపహరేశ్వరాలయానికి చేరుకోవచ్చు.

ఏర్పాట్లు పూర్తి..

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఆలయ ప్రాంగణంలో గురువారం రాత్రి ప్రారంభమై శుక్ర, శనివారాలు జరిగే పూజాకార్యక్రమాల కోసం ఆలయ కమిటీ, దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆలయ చైర్మన్ నార్వాడి వెంకట్రావు పాటిల్, ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ రవికిషన్‌గౌడ్ తెలిపారు. నిర్మల్ పట్టణం నుంచి భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ వారు ప్రత్యేక బస్సులు నడపనున్నారు. ఆలయ ప్రాంగణంలో శుక్రవారం మహాశివరాత్రి పర్వదినాన తెల్లవారుజాము బ్రహ్మముహూర్తాన స్వామివారికి ఏకాదశ రుద్రాభిషేకం, మంత్రపుష్పం నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించనున్నారు. అనంతరం రాత్రి 11గంటల నుంచి మహాన్యాస పూర్వక అభిషేకం, బిల్వార్చన నిర్వహించి స్వామివార్ల లింగోద్భవ కాలదర్శన కార్యక్రమానంతరం శివపార్వతుల కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఇందుకు ఆలయ ముందుభాగంలో ఏర్పాట్లు చేశారు. శనివారం ఆలయ ప్రాంగణంలో భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.


శ్రీమాత అన్నపూర్ణేశ్వరీదేవి

కాల్వ, దిలావర్‌పూర్‌లో..

మండలంలోని కాల్వ పరిసర అటవీప్రాంతంలో వెలసిన శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయాన్ని కూడా మహాశివరాత్రి పర్వదినాన భక్తులు దర్శించుకోనున్నారు. నిర్మల్ నుంచి బయలుదేరిన భక్తులు కదలి పాపహరేశ్వరాలయానికి వెళ్లే రోడ్డు మార్గంలో ఎనిమిది కిలో మీటర్లు ప్రయాణిస్తే న్యూలోలం గ్రామ సమీపాన నిర్మల్–భైంసా రహదారిపై స్వామివారి స్వాగతోరణం దర్శనమిస్తుంది. తోరణంగుండా మరో మూడుకిలోమీటర్లు ఉత్తరాన ప్రయాణిస్తే ఆలయానికి చేరుకోవచ్చు. భక్తుల పాలిట కరుణామయుడిగా నీరాజనాలు అందుకుంటున్నాడు. స్వామివారి చెంతనే ఉన్న అష్టముఖి కోనేరులో స్నానం చేసి స్వామివారిని దర్శించుకుంటే సంకటాల నుంచి ఊరట లభిస్తుందని భక్తుల నమ్మకం. స్వామివారు కొలువుదీరిన గుట్ట వక్ర సింహ ఆకారంలో ఉండడం విశేషం. మండల కేంద్రమైన దిలావర్‌పూర్‌లోని ఏకనాథుని ఆలయం, అటవీప్రాంతంలోని శ్రీరాజరాజేశ్వరాలయాల్లో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్ర, శనివారాల్లో ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించనున్నారు.

అన్ని ఏర్పాట్లు పూర్తిచేశాం



శ్రీమాతాన్నపూర్ణ పాపహరేశ్వరాలయంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్ర, శనివారాల్లో జరిగే మహోత్సవాలకు సంబంధించి ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తిచేశాం. వివిధ రాష్ట్రాలు, పొరుగు జిల్లాల నుంచి వచ్చే భక్తులకు తాగునీరు, వైద్యసేవలు, అన్నదానం, వసతి తదితర ఏర్పాట్లు చేశాం. స్వామివారి దర్శనార్థం వచ్చే భక్తులు కూడా ఆలయ కమిటీ, అధికారుల సూచనలు పాటించి స్వామివారిని దర్శించుకోవాలి.

– రంగు రవికిషన్‌గౌడ్, ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్, ఆలయ ఇన్‌చార్జి ఈవో

విజయలక్ష్మికి జాతీయ పురస్కారం



అవార్డు అందుకుంటున్న విజయలక్ష్మి

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణం ఇందిరానగర్ కాలనీకి చెందిన వీరాంజనేయ స్వయం సహాయక సంఘం (ఎస్‌హెచ్‌జీ) అధ్యక్షురాలు విజయలక్ష్మి బుధవారం జాతీయస్థాయి పురస్కారం అందుకున్నారు. బ్యాంకు రుణాలు సద్వినియోగం చేసుకుని చిరు ధాన్యాలతో కూడిన ఆహార ఉత్పత్తులను తయారు చేస్తూ అంచెలంచెలుగా ఎదిగిన ఆమెను ఉత్తమ వ్యాపారవేత్తగా కేంద్రం గుర్తించింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వశాఖ దేశవ్యాప్తంగా పురస్కారాలు ప్రకటించగా తెలంగాణ నుంచి విజయలక్ష్మి ఎంపికయ్యారు. ఢిల్లీలోని గురుగాంప్ పట్టణంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో అక్కడి మేయర్ మధు ఆజాద్ చేతుల మీదుగా ఆమె ఈ పురస్కారం అందుకున్నారు. విజయలక్ష్మి జాతీయ స్థాయి అవార్డు అందుకోవడంపై మున్సిపల్ కమిషనర్ ఎండీ.ఖమర్ అహ్మద్ హర్షం వ్యక్తం చేశారు. ఆదిలాబాద్ పేరును ఢిల్లీ వరకు తీసుకెళ్లినా విజయ హెల్త్‌ఫుడ్ మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఎస్‌హెచ్‌జీ సభ్యురాలు వ్యాపారవేత్తగా ఎదుగడం గర్వంగా ఉందని పేర్కొంటూ ఆమెకు అభినందనలు తెలిపారు.

వృద్ధుడి అదృశ్యం

ఆదిలాబాద్‌టౌన్: బజార్‌హత్నూర్ మండలం మోర్ఖండికి చెందిన 70 ఏళ్ల టేకం కిషన్ అనే వృద్ధుడు అనారోగ్యంతో జిల్లా కేంద్రంలోని రిమ్స్‌లో చేరాడు. ఈనెల 5న ఆస్పత్రి నుంచి అదృశ్యమయ్యాడు. కుటుంబీకులు చుట్టుపక్కల గాలించినప్పటికీ ఆచూకీ లభించలేదు. దీంతో ఆయన మనువడు దినేష్ టూటౌన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమణారెడ్డి వివరించారు.

ఇంద్రవెల్లిలో యువకుడు..

ఇంద్రవెల్లి: మండలకేంద్రంలో బామ్నె రుతిక్ (23) అనే యువకుడు అదృశ్యమయ్యాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన ప్రకారం.. స్థానిక భీంనగర్ కాలనీకి చెందిన రుతిక్ ఈ నెల 3న ఇచ్చోడలోని తన స్నేహితుడి ఇంట్లో ఎంగేజ్మెంట్ కార్యక్రమానికి వెళ్తానని చెప్పి వెళ్లి తిరిగా రాలేదు. కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్లలో, పలుచోట్ల వెదికినా ఆచూకీ లభించకపోవడంతో యువకుడి తండ్రి విక్రమ్ బుధవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సునీల్ తెలిపారు.

నేటి నుంచి వడ్డాడి నరసింహస్వామి జాతర


ముస్తాబైన లక్ష్మీనరసింహ స్వామి ఆలయం

తాంసి: మండలంలోని వడ్డాడి గ్రామంలో వెలసిన భూలక్ష్మీ నరసింహస్వామి ఆలయ జాతరను ఏటా మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకొని గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారు. కోరిన కోర్కెలు తీర్చే స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివస్తారు. నేటి నుంచి ఉత్సవాలు షురూ కానున్న నేపథ్యంలో నిర్వాహకులు ఇప్పటికే ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. మూడు రోజులపాటు నిర్వహించే జాతరలో భాగంగా నేడు సామూహిక సత్యనారాయణ వ్రతాలు, హోమం, స్వామివారి కల్యాణం చేపట్టనున్నారు. చివరి రోజు శనివారం ఉదయం పూర్ణాహుతి, సాయంత్రం రథోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు శ్రీకాంత్ తెలిపారు. ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు.

అన్ని రంగాల్లో రాణిస్తున్న మహిళలు

- ఆర్టీసీ రీజినల్ మేనేజర్ సోలోమన్


మహిళా ఉద్యోగులను సన్మానిస్తున్న ఆర్ఎం

ఆదిలాబాద్: మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని ఆదిలాబాద్ ఆర్టీసీ రీజినల్ మేనేజర్ సోలోమన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో మహిళా దినోత్సవంను బుధవారం ముందస్తుగా నిర్వహించారు. పలువురు ఆర్టీసీ ఉద్యోగులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పురుషులకు దీటుగా మహిళలు అన్ని రంగాల్లో ఎదుగుతున్నారన్నారు. ఆర్టీసీ అభివృద్ధిలో సైతం కీలకపాత్ర వహిస్తున్నారన్నారు. ఆదిలాబాద్ డిపోమేనేజర్ కల్పన తదితరులు ఉన్నారు.

శుభకార్యానికి వెళ్తూ.. కానరాని లోకాలకు


జాదవ్ వినోద్ (ఫైల్)

నేరడిగొండ: శుభకార్యానికి వెళ్తూ రోడ్డు ప్రమాదంలో ఒకరు కానరాని లోకాలకు వెళ్లగా, ఇద్దరికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని బోరిగాం క్రాస్ రోడ్డు వద్ద బుధవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. బోథ్ మండలం నిగిని గ్రామానికి చెందిన జాదవ్ వినోద్(33), రాథోడ్ ఉద్దవ్, ప్రదీప్‌లు బైక్‌పై నేరడిగొండ మండలంలోని బోరిగాంలో వారి బంధువుల వివాహానికి ఎన్‌హెచ్ 44 గుండా వెళ్తున్నారు. బోరిగాం క్రాసింగ్ వద్ద అతివేగంగా, అజాగ్రత్తగా రాథోడ్ ఉద్దవ్ బైక్ నడపడంతో వాహనం అదుపుతప్పి ముగ్గురు కిందపడ్డారు. వినోద్‌కు తలకు తీవ్ర గాయాలై సంఘటన స్థలంలోనే మృతిచెందాడు. మిగతా ఇద్దరికి తీవ్ర గాయాలు కావడంతో వారిని చికిత్స నిమిత్తం నిర్మల్ ఆస్పత్రికి తరలించారు. మృతదేహానికి బోథ్ ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆయన మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

మహిళను వేధిస్తున్న యువకుడిపై కేసు

ఇంద్రవెల్లి: మహిళను వేధిస్తున్న యువకుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సునీల్ తెలిపారు. మండలంలోని గిన్నెరతండా గ్రామానికి చెందిన చావన్ అంకుష్(23) అదే గ్రామానికి చెందిన ఓ మహిళను ఏడాదిగా ఫోన్ చేస్తూ వేధింపులకు గురి చేస్తున్నాడు. పలుమార్లు గ్రామ పెద్దలతో పంచాయితీ నిర్వహించినా యువకుడి ప్రవర్తనలో మార్పు రాలేదు. ఈ క్రమంలో బుధవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధిత మహిళ పేర్కొంది. యువకుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇసుక లారీకి రూ.50వేల జరిమానా

కుంటాల: మండలంలోని అర్లి(కే)16 జాతీయ రహదారిపై మంగళవారం సాయంత్రం ఎస్సై రజనీకాంత్ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాలు తనిఖీ చేశారు. నిర్మల్ నుంచి కుంటాలకు అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని పట్టుకుని తహసీల్దార్‌కు అప్పగించారు. ఇసుక లారీకి తహసీల్దార్ ఎజాజ్ అహ్మద్‌ఖాన్ రూ.50వేల జరిమానా విధించారు.

విద్యార్థులు లక్ష్య సాధనకు కృషి చేయాలి


బహుమతి ఇస్తున్న మహేశ్వర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి

నిర్మల్‌ఖిల్లా: విద్యార్థులు లక్ష్య సాధనకు కృషి చేయాలని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, డీఈవో రవీందర్‌రెడ్డి, అల్ఫోర్స్ చైర్మన్ వీ నరేందర్ రెడ్డి సూచించారు. జిల్లాకేంద్రంలోని దివ్య గార్డెన్స్‌లో బుధవారం సాయంత్రం అల్ఫోర్స్ హైస్కూల్ ఆధ్వర్యంలో 'సాంప్రదాయ్ మహోత్సవ్' ను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఇందులో ఆకాశమే హద్దుగా, కళావైభవం చాటే కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ముఖ్య అతిథులు మాట్లాడుతూ.. ప్రతీ విద్యార్థి శ్రద్ధ, ఏకాగ్రతతో అధ్యాపకులు బోధించే విషయాలను విని విశ్లేషించుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు చదువుతోపాటు సంస్కారాన్ని నేర్పించాలని కోరారు. 34ఏళ్లుగా అల్ఫోర్స్ విద్యాసంస్థ పిల్లల ఎదుగుదలకు ఎనలేని కృషి చేస్తోందని సంస్థ చైర్మన్ నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఇతరభాషల కంటే ముందు పిల్లలకు మాతృభాష తెలుగు నేర్పాల్సిన అవసరం ఉందని తెలిపారు. వేడుకల్లో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన సంప్రదాయ నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆపరేషన్ థియేటర్ నుంచి పరీక్షా కేంద్రానికి..

- ఇంటర్ పరీక్ష రాసిన ఇద్దరు విద్యార్థులు


పరీక్ష సెంటర్‌లోకి వీల్‌చైర్‌లో వస్తున్న సల్మాన్

లోకేశ్వరం: మండలంలోని ధర్మోర గ్రామానికి చెందిన సల్మాన్, మహేశ్ ఇంటర్ విద్యార్థులు. ఈనెల 4న ఇంటి నుంచి ఇతర పనుల నిమిత్తం బైక్‌పై మండల కేంద్రానికి వెళ్లారు. మొహళ గ్రామ సమీపంలో బైక్ అదుపు తప్పగా ఇద్దరికీ తీవ్రగాయాలయ్యాయి. వెంటనే స్థానికులు లోకేశ్వరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అక్కడ ప్రథమ చికిత్స పొందారు. రాత్రి మెరుగైన వైద్యం కోసం అంబులెన్స్‌లో నిర్మల్ ఆస్పత్రికి తరలించారు. వెంటనే అక్కడి ఎముకల వైద్య నిపుణుడు ప్రమోద్‌చంద్ర ఇద్దరు విద్యార్థులకు విరిగిన ఎముకలకు మంగళవారం తెల్లవారుజాము వరకు ఆపరేషన్ నిర్వహించారు. దీంతో బుధవారం ఇంటర్‌మొదటి సంవత్సరం గణిత పరీక్షను అంబులెన్స్‌లో వచ్చి రాశారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాలలో బుధవారం ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీలు నిర్వహించారు. హ్యాండ్‌బాల్ జిల్లా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ.. ఈ పోటీల్లో ఉమ్మడి జిల్లా నుంచి వంద మంది క్రీడాకారులు పాల్గొన్నారని తెలిపారు. ఉత్తమ ప్రతిభ చూపిన 16 మందిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. సంజయ్, శ్రావణ్, అనిశ్వర్, సంతోష్, అనిల్‌కుమార్, ప్రదీప్, కార్తీక్, అశ్విన్, కార్తీక్, శ్రీధర్, నవీన్, సాయివర్ధన్, రిషికేష్, మన్విత్ ఎంపికయ్యారు. ఈ నెల 8 నుంచి 10 వరకు వరంగల్‌లో జరిగే రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొంటారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కృష్ణారావు, కోచ్‌లు అరవింద్, రాకేశ్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.